సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 13 । మే । 2025



పుష్కరాలకు ఆర్టీసీ సన్నద్ధం

ప్రతి పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతి పుష్కరాలకు టీజీఎస్ ఆర్టీసీ సన్నద్ధమైంది. - 8లో ▸



యథావిధిగా డిగ్రీ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలను బుధవారం నుంచి నిర్వహించనున్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.6° /27.7°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

వేయిస్తంభాల ఆలయం పక్కనే ఉన్న కుడా గార్డెన్‌లో ఫొటో షూట్ కోసం మొక్కల నడుమ విద్యుత్ వెలుగులు, కొత్తగా వేస్తున్న గ్రీనరీ, మొక్కలు





పసిడి వన్నెలకు.. పచ్చందాల స్వాగతం

సుందరీమణులకోసం ముస్తాబవుతున్న కోటతోపాటు సందర్శన ప్రాంతాలు

- వేయిస్తంభాల దేవాలయంలో గ్రీన్‌కార్పెట్, ఇరువైపులా పూల మొక్కలు, లైటింగ్
- మిస్ వరల్డ్ బృందానికి స్వాగతం పలుకుతూ వీడియోలు

హన్మకొండ కల్చరల్/వెంకటాపురం(ఎం)/ఖిలా వరంగల్ : ప్రపంచ సుందరీమణుల రాక కోసం ఖిలావరంగల్ కోట, వేయిస్తంభాల, రామప్ప ఆలయాలు పచ్చటి మొక్కలతో అందంగా ముస్తాబవుతున్నాయి. 19, 20 శతాబ్దాలలో విదేశీ టూరిస్టులను ఎక్కువగా ఆకర్షించిన దేవాలయంగా వేయిస్తంభాల ఆలయం గుర్తింపు పొందింది. వాళ్లు తమ పుస్తకాల్లో టెంపుల్ ఆఫ్ హనమ్‌కొండ అంటూ సంబోధించారు. దీంతో సుందరీమణుల రాకకు ఆలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నారు. వారు బస్సుదిగి ఆలయంలోకి నడిచే దారిలో గ్రీన్‌కార్పెట్ పరిచి ఇరుపక్కలా పచ్చటి మొక్కలను అమర్చుతున్నారు. కుడా గార్డెన్‌ను క్రోటాన్స్, పూలకుండీలతో అలంకరిస్తున్నారు. ఫొటోలు దిగేలా గ్రీనరీ, వివిధ రకాల పూలమొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు దేవాలయం చుట్టూ గ్రీన్ కార్పెట్, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆలయ పరిక్రమ చుట్టూ, కల్యాణమండపం, నందీశ్వరుని వద్ద ఫొటోషూట్‌కు తగినట్లు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

రామప్పపై విస్తృత ప్రచారం

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే సుందరీమణులు బుధవారం యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయానికి వస్తుండడంతో ప్రభుత్వం, టూరిజం శాఖ అధికారులు ఆ బృందానికి స్వాగతం పలుకుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల మిస్ ఇండియా నందిని గుప్తా రామప్ప ఆలయాన్ని సందర్శించి ఫొటో షూట్ చేశారు. ఆమె ఆలయం చుట్టూ తిరుగుతూ శిల్పకళాసంపదను తనివితీరా చూస్తున్న దృశ్యాలను చిత్రీకరించారు. నిమిషం నిడివి ఉన్న ఒక వీడియో, 38 సెకన్లు ఉన్న మరో వీడియోను రూపొందించి విడుదల చేశారు. ఆలయ శిల్ప కళా సంపద, చరిత్రను వివరిస్తూ ప్రపంచ సుందరీమణులకు స్వాగతం పలుకుతూ చేసిన ఈ ఆహ్వాన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. కాగా, హైదరాబాద్‌నుంచి సుందరీమణులు మన బ్రాండ్ ప్రపంచమంతా తెలిసేలా 'తెలంగాణ జరూర్ ఆనా' పేరుతో ఉన్న ఏసీ బస్సులో రానున్నారు.



శిల్ప కళా సంపదను చూస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా (ఫైల్)



3డీ మ్యాపింగ్ ప్రొజెక్షన్ లైట్ల వెలుగుల్లో ఖిలావరంగల్ కోట శిల్పాల ప్రాంగణం

3డీ మ్యాపింగ్ ప్రొజెక్షన్, హై-రెజల్యూషన్ ప్రొజెక్టర్లు

ప్రపంచ సుందరీమణుల రాక సందర్భంగా ఖిలావరంగల్ కోటలోని కట్టడాలు, శిల్ప కళా సంపద విద్యుత్ దీపాల వెలుగుల్లో మెరిసిపోతున్నాయి. కట్టడాలు మరింత ఆకర్షణీయంగా కనిపించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ 3డీ మ్యాపింగ్ ప్రొజెక్షన్, హై -రెజల్యూషన్ ప్రొజెక్టర్లు, లేజర్ లైట్లు, మూవింగ్ హెడ్స్ వంటి అధునాతన సాంకేతికతను వినియోగించారు. బంగారు, తెలుపు వర్ణం కాంతుల్లో శిల్పాలు మెరిసిపోతున్నాయి. దీనికితోడు ఫ్లడ్‌లైట్లు, ఎల్ఈడీ(వామ్) లైట్ల వెలుగులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

న్యూస్‌రీల్

17న హనుమాన్ భక్తుల బైక్‌ర్యాలీ

చిట్యాల: ఈనెల 17న రేగొండ మండల కేంద్రం నుంచి భూపాలపల్లి హనుమాన్ దేవాలయం వరకు హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు చిట్యాల మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన హనుమాన్ సేవా సమితి వ్యవస్థాపకుడు రావుల సాయిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మన సైనికులకు ఆత్మధైర్యం కలిగించేందుకు యుద్ధంలో విజయం సాధించేందుకు హనుమాన్ దీక్ష స్వాములు సైనికులకు సంఘీభావం తెలుపుటకు ఈనెల 17న బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమాన్ దీక్ష భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కొడవటంచ దేవాలయంలో భక్తులకు బిక్ష ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పీఎస్‌ను సందర్శించిన శిక్షణ ఐపీఎస్‌లు

మొగుళ్లపల్లి: శిక్షణలో భాగంగా నలుగురు శిక్షణ ఐపీఎస్ అధికారులు సోమవారం మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ప్రొబేషనరీ పీరియడ్‌లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లను దర్శించి స్టేషన్ హౌజ్ అధికారి విధులు, క్షేత్రస్థాయిలోని విధి విధానాలను ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. వారివెంట సీఐ మల్లేష్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ పరామర్శ

కాటారం: మండలంలోని ధన్వాడకు చెందిన తుల్సెగారి రాజలింగు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

నాగులమ్మ ఆలయానికి మురుగునీరు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయం నాగులమ్మ ఆలయానికి మురుగునీరు వస్తున్నా దేవాదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దేవస్థానానికి సంబంధించిన నిర్మాణాల ద్వారా ఆలయం వద్దకు మురుగునీరు వస్తుంది. సరస్వతినది పుష్కరాలకు పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాగా, నాగులమ్మ ఆలయాన్ని అధికారులు విస్మరించారని విమర్శలు వస్తున్నాయి. మురుగునీరు రాకుండా చర్యలు తీసుకొని నిర్మాణాలపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కేయూ కామర్స్ బీఓఎస్ చైర్‌పర్సన్‌గా వరలక్ష్మి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా ఆ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మిని నియమిస్తూ సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆమె వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డినుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ప్రస్తుతం వరలక్ష్మి సీడీసీ డీన్‌గా, యూనివర్సిటీ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

బోధనకు మెరుగు..

నేటినుంచి ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

- ఇప్పటికే రిసోర్స్ పర్సన్లకు ట్రైనింగ్..
- నేటినుంచి స్కూల్ అసిస్టెంట్లు, 20నుంచి ఎస్జీటీలకు..



సన్నాహక సమావేశానికి హాజరైన ఎస్ఆర్పీలు

భూపాలపల్లి అర్బన్: విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ శిక్షణ కార్యక్రమం నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుంది. దీనిద్వారా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యా నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

శిక్షణ కార్యక్రమం..

రాష్ట్రంలోని అన్ని విద్యా విభాగాలకు చెందిన ఉపాధ్యాయులకు ఈ శిక్షణ అందించనున్నారు. జిల్లాలో 1,068 మంది స్కూల్ అసిస్టెంట్లు, 872మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) ఈ కార్యక్రమంలో శిక్షణ పొందనున్నారు. శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు వివిధ స్థాయిలలో రిసోర్స్ పర్సన్లను (ఆర్పీ) ఎంపిక చేశారు. ప్రతీ జిల్లా నుంచి ప్రాథమిక స్థాయిలో 8మంది ఎస్జీటీలు, ఉన్నతస్థాయిలో సబ్జెక్టుకు నలుగురు స్కూల్ అసిస్టెంట్ల చొప్పున మొత్తం 8మంది స్టేట్ ఆర్పీలుగా శిక్షణ పొందారు. ఈ స్టేట్ ఆర్పీలు జిల్లాస్థాయి డీఆర్పీలకు, డీఆర్పీలు మండలస్థాయి ఎంఆర్పీలకు శిక్షణ అందిస్తారు. స్కూల్ అసిస్టెంట్లకు జిల్లాకేంద్రంలో ఏకకాలంలో శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రణాళికాబద్ధమైన శిక్షణ కోసం..

ఈ వేసవి శిక్షణ శిబిరాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలోని డీఈఓ కార్యాలయంలో ఎస్జీటీ డీఆర్పీలు గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్రాల స్కూల్ అసిస్టెంట్ డీఆర్పీలతో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణను సద్వినియోగం చేసుకునేలా రిసోర్స్ పర్సన్లు కీలకపాత్ర పోషించాలని రాజేందర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ లక్ష్మణ్, సీఎంఓ రమేష్ ఆర్పీలు పాల్గొన్నారు. ఈ సమావేశం శిక్షణ కార్యక్రమం సమర్థవంతమైన అమలుకు దిశానిర్దేశం చేసింది.



గణపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ

మూడు విడతలుగా శిక్షణ

జిల్లాలో నేడు (మంగళవారం) ప్రారంభమయ్యే మొదటి విడత శిక్షణ ఈ నెల 17వ తేదీ వరకు ఉంటుంది. రెండో విడత 17నుంచి 25వరకు, మూడో విడత 27వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఐదు రోజుల చొప్పున నిర్వహించే ఈ శిక్షణ తరగతులు మూడు వారాల పాటు నిర్వహించనున్నారు. మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు, గణితం, సోషల్, మండలస్థాయి ఎస్జీటీ ఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులకు గణపురం ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయులకు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఐఆర్‌పీలకు, చెల్పూర్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిషు ఉపాధ్యాయులకు, ఎస్జీటీ ఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు.

దీర్ఘకాలిక ప్రభావం

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ శిక్షణ కార్యక్రమం ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు మెరుగుపడటం వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెరుగుతాయి. ఇది విద్యా నాణ్యతను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఈ కార్యక్రమం జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉంటూ విద్యార్థులలో 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలు అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది.

శిక్షణ లక్ష్యాలు..

శిక్షణ కార్యక్రమం ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి రూపొందించబడింది. ఆధునిక బోధనా పద్ధతులు, అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను అందించడం, విద్యా సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం వంటి అంశాలపై శిక్షణ దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమం విద్యార్థులలో క్లిష్టమైన ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించడంలో ఉపాధ్యాయులకు సహాయపడుతుందని భావిస్తున్నారు. ఈ శిక్షణ విద్యా నాణ్యతను జాతీయ సగటుతో సమానం చేయడానికి ముఖ్యమైన అడుగుగా పరిగణించబడుతుంది.


హామీలు నెరవేరుస్తున్నాం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

భూపాలపల్లి అర్బన్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని కనీస వేతనాల సలహా సభ్యులు, ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఎస్.నర్సింహారెడ్డి తెలిపారు. ఏరియాలోని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 8, 9వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఐఎన్‌టీయూసీ భవనంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో అన్ని ఏరియాల ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న క్లరికల్ ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసి, కారుణ్య నియామకాల వయోపరిమితిని 35నుంచి 40ఏళ్లకు పెంచినట్లు చెప్పారు. నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించినట్లు తెలిపారు. ఒడిశాలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు, బొగ్గు గనులను సింగరేణికే కేటాయించే విధంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిని కలిసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రాజేందర్, బుచ్చయ్య, సమ్మిరెడ్డి, వేణు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి




గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

భూపాలపల్లి అర్బన్: ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య పిలుపునిచ్చారు. ఏరియాలోని కేటీకే 5వ గనిలో సోమవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనులను అమ్మకానికి పెట్టి బొగ్గు పరిశ్రమను సజీవంగా సమాధి చేస్తుందన్నారు. సింగరేణిలో కొత్త బావులను అనుమతించకుండా కట్టడిచేస్తూ బొగ్గురేటును పెంచుకోకుండా అడ్డుపడుతుందన్నారు. బొగ్గు పరిశ్రమ రక్షణ కోసం సింగరేణి బొగ్గు గనులను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో సింగరేణి గని కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సార్వత్రిక సమ్మె పిలుపులో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ భాగస్వాములుగా ఉన్నందున సింగరేణి గని కార్మికులను భాగస్వాములను చేసేందుకు సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ ముందుకు రావాలని అన్నికార్మిక సంఘాలను కలుపుకొని సమ్మెను విజయవంతం చేసేందుకు పూనుకోవాలన్నారు. సమావేశంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు దయాకర్, శంకర్, జనార్దన్, ప్రసాదరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.


ప్రొఫెసర్ మల్లారెడ్డికి ఫెల్లోషిప్ ప్రదానం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ గణితశాస్త్ర విభాగం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని అకాడమీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్‌కమ్యూనికేషన్ హానరీ ఫెల్లోషిప్ ప్రదానం చేసింది. ఈ నెల 11న హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పద్మ గ్రహీత డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా మల్లారెడ్డి హానరీ ఫెల్లోషిప్ అందుకున్నారు. ఈ మేరకు మల్లారెడ్డిని సోమవారం యూనివర్సిటీలో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం అభినందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.రాజేందర్, నాగరాజు, ఎల్‌పీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

యూత్ కాన్ఫరెన్స్‌కు ఎంపిక



శ్రీజ జాదవ్



గుజ్జర వికాస్

కేయూ క్యాంపస్ : ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ సోమవారం తెలిపారు. కర్ణాటకలోని మంగళూరులో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న ఐకాన్ యూత్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్-2025కు కేయూ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు శ్రీజ జాదవ్, గుజ్జర వికాస్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. వలంటీర్లను బయోటెక్నాలజీ విభాగం అధిపతి డాక్టర్ శాస్త్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ టి.రాధిక అభినందించారు.

వైభవంగా పుష్కరాల నిర్వహణ

- కలెక్టర్ రాహుల్‌శర్మ




సరస్వతిఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే

కాళేశ్వరం: కాళేశ్వరంలో రాష్ట్ర ప్రభుత్వం అంగరంగ వైభవంగా సరస్వతినది పుష్కరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కాళేశ్వరంలో పుష్కర పనులను సోమవారం ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలలో ఏకైక త్రివేణి సంగమమని, దేశంలో రెండో ప్రాంతం అయిన కాళేశ్వర క్షేత్రం అద్భుతమైన ఘట్టానికి వేదిక కాబోతుందన్నారు. సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహించే త్రివేణి సంగమంలో ఈ నెల 15న అట్టహాసంగా ప్రారంభం కానున్న సరస్వతి నది పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించారు. ప్రతిరోజు కాశీ పీఠాధిపతిపతులతో నది హారతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 15న సీఎం సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరించడంతో పాటు గోదావరి హారతి, త్రిలింగ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ సరస్వతి పుష్కరాలకు అత్యంత అరుదైన చరిత్ర ఉందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేయించేందుకు ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని, అధికారులు కాళేశ్వరంలో ఉండి కేటాయించిన విధుల్లో నిమగ్నం కావాలని తెలిపారు. 15న సీఎం పర్యటనను పురస్కరించుకుని జిల్లా అధికార యంత్రాంగం అంతా కూడా కాళేశ్వరం ఏర్పాట్లలో నిమగ్నం కావాలని సూచించారు. పుష్కరాల్లో భక్తులకు సేవలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అంతా అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు చేశామన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారివెంట అడిషనల్ ఎస్పీ కిషన్, సీఐ రామచందర్‌రావు ఉన్నారు.

సౌకర్యాలు అక్కర్లేదా?

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, బీఆర్ఎస్ నాయకులు

కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాల్లో పుణ్యస్నానాలకు వచ్చే సామాన్యులకు కనీసం సౌకర్యాలు కల్పించకపోవడం సిగ్గుచేటని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అసహనం వ్యక్తంచేశారు. ఈ నెల 15నుంచి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరినదిలో ప్రారంభం కానున్న సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన పుష్కర పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో సరస్వతి పుష్కరాలు ప్రారంభం కానుండగా ఎక్కడ కూడా పనులు పూర్తి కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు ఇద్దరూ కలిసి సరస్వతి పుష్కరాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సరస్వతి అమ్మవారి మండపాన్ని చూస్తే పుష్కర పనులు ఎలా చేస్తున్నారో అర్థం అవుతుందన్నారు. మంథని ఎమ్మెల్యే మంత్రిగా ఉండగా ఆయన సతీమణి ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉందని, వీరిద్దరు సరస్వతి పుష్కరాలను ఘనంగా నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత ఉన్నా.. ఆ విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పుష్కర పనులను ఎలాంటి నైపుణ్యంలేని కాంగ్రెస్ వాళ్లకు అప్పగించారని, అధికారులు క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు చేయాలన్నారు. ఈ క్రమంలోనే నాణ్యతలేని పనులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. సరస్వతి పుష్కరాల్లో జరిగిన పనులపై క్వాలిటీ పరీక్షలు నిర్వహించాలని, సమగ్ర విచారణ జరిపించడంతోపాటు పనులకు సంబంధించిన నిధులు, పనులు, టెండర్ల జారీ ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పుష్కరాల్లో సామాన్యులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో తాము బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. ఆయన వెంట శ్రీనివాసరావు, అడప సమ్మయ్య, శ్రీపతి బాపు, మోహన్‌రెడ్డి, శ్రీహరి, జక్కు రాకేష్, జవ్వాజీ తిరుపతి, అలీంఖాన్, సుజాత, పోత వెంకట్‌స్వామి ఉన్నారు.

గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు



గోదావరికి పౌర్ణమి హారతి

కాళేశ్వరం: పౌర్ణమి సందర్భంగా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో గోదావరికి హారతి కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం నుంచి కాలినడకన మంగళవాయిద్యాలతో తరలి వెళ్లారు. గోదావరిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ప్రత్యేక పూజలతో హారతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు భైకుంఠపాండా, రామాచారి, సుబ్రహ్మణ్యశర్మ, రామకృష్ణ, రాముశర్మ, శరత్ చంద్ర, శ్రావణ్ పాల్గొన్నారు.

పౌర రక్షణ వలంటీర్లుగా నమోదుకు అవకాశం

న్యూశాయంపేట : భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'మై భారత్ పౌర రక్షణ వలంటీర్లుగా పనిచేయడానికి యువత నుంచి పేర్ల నమోదుకు ఆహ్వానిస్తున్నట్లు మై భారత్ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా యువజన సంక్షేమాధికారి సీహెచ్.అన్వేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతలో పౌర బాధ్యత, క్రమశిక్షణ భావం పెంపొందించడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో శిక్షణ ఇచ్చి పనిచేయడానికి సన్నద్ధం చేస్తామని తెలిపారు. ఆసక్తి గల యువత మై భారత్ పోర్టల్ mybharat.gov.inలో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9491383832 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



పోషఎల్లమ్మ (ఫైల్)

లింగాలఘణపురం : మండలంలోని వడిచర్లకు చెందిన గండి పోషఎల్లమ్మ (68)వడదెబ్బతో సోమవారం మృతి చెందింది. ఆదివారం కుటుంబ సభ్యులు బంధువుల వివాహానికి వెళ్లగా ఇంటి వద్ద ఉన్న పోషఎల్లమ్మ గ్రామంలో ఎండలో తిరిగింది. వివాహానికి వెళ్లిన కుటుంబ సభ్యులు ఆలస్యంగా ఇంటికి రావడంతో నిద్రపోతుందని భావించి వారు కూడా నిద్రపోయారు. ఉదయం లేచి చూడగా తీవ్ర జ్వరంతో కనిపించగా గమనించి ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలోనే మృతి చెందింది.

రాయపర్తిలో వృద్ధుడు..



ఉప్పలయ్య (ఫైల్)

రాయపర్తి: వడదెబ్బతో మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన కంతుల ఉప్పలయ్య(75) మృతి చెందాడు. సోమవారం ఎండవేడిమికి అస్వస్థతకు గురికావడంతో ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి ..



సైదులు(ఫైల్)

చిన్నగూడూరు: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని జయ్యారం పెద్ద చెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ సైదులు(55) చేపలు పట్టే క్రమంలో చెరువులో ఉన్న నాచు, వల కాళ్లకు చుట్టుకుంది. గమనించి సహ జాలర్లు సైదులును కాపాడే యత్నం చేస్తుండగానే నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


60 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సుమారు రూ. 15 లక్షల విలువైన 60 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం వివరాలు వెల్లడించారు. పలు రైళ్లలో ఎండు గంజాయి సరఫరా చేస్తున్నారనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా కురవి గేట్ రైల్వే ట్రాక్ సమీపంలోని చెట్ల పొదలమాటున రెండు ప్లాస్టిక్ సంచుల్లో ఎండు గంజాయి లభ్యమైందన్నారు. ఘటనాస్థలిలో ఎవరూలేరని, గంజాయి సీజ్ చేసి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ సీఐలు నాగేశ్వర రావు, నీరజ, ఎస్సైలు చంద్రశేఖర్, అశోక్, కిరీటి, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, మధు, కానిస్టేబుళ్లు రాజు, శ్రీను, శేఖర్, ఇబ్రహీం, భవా ని, నర్సింహరావు, రవి, సుమన్ పాల్గొన్నారు.

పుష్కరాలకు ఆర్టీసీ సన్నద్ధం..

ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు

- రోజుకు 140 ట్రిప్పులు.. భక్తుల సంఖ్య పెరిగితే మరిన్ని అదనపు సర్వీసులు
- ఏసీ బస్సులకు హైదరాబాద్ నుంచి రిజర్వేషన్ సౌకర్యం
- చార్జీలు ఖరారు చేసిన అధికారులు



హన్మకొండ/కాళేశ్వరం: ప్రతీ పన్నెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతీనది పుష్కరాలకు టీజీఎస్ ఆర్టీసీ సన్నద్ధమైంది. ఈ మేరకు ఆర్టీసీ వరంగల్ రీజియన్ యాజమాన్యం, అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈక్రమంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రతీ రోజు 140 బస్సులకు తగ్గకుండా నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. భక్తుల సంఖ్య పెరిగితే మరిన్ని అదనపు బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నారు. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి 40 బస్సులు, వరంగల్ బస్ స్టేషన్ నుంచి 25, జనగామ, పరకాల, నర్సంపేట బస్ స్టేషన్ నుంచి 10 చొప్పున, భూపాలపల్లి నుంచి 20, తొర్రూరు, మహబూబాబాద్ బస్ స్టేషన్ నుంచి 5 చొప్పున, హైదరాబాద్ నుంచి 15 ప్రత్యేక బస్సులు నడిపేలా కార్యాచరణ రూపొందించారు. అదే విధంగా హైదరాబాద్ నుంచి ఏసీ బస్సులు నడుపనున్నారు. ఏసీ బస్సులకు హైదరాబాద్ నుంచి రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ నెల 13 నుంచి రిజర్వేషన్ చేసుకోవచ్చు. సరస్వతీనది పుష్కరాలు జరిగే కాళేశ్వరంలో నాలుగు ఎకరాల్లో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. మొత్తం 9 పాయింట్లు ఉంటాయి. 9 పాయింట్ల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులు బయలుదేరుతాయి. కాళేశ్వరంలో ఇద్దరు అధికారులు, 10 మంది సూపర్ వైజర్లు, 20 మంది వలంటీర్లు నిరంతరాయంగా సేవలు అందిస్తారు. ఉదయం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు బస్సులు నడుస్తాయని అధికారులు తెలిపారు. కాగా, సరస్వతీనది పుష్కరాలకు చార్జీలు ఖరారు చేశారు. సాధారణ చార్జీలతో చూసుకుంటే ఒకటిన్నర రెట్లు చార్జీలు పెంచారు.

రూట్‌ల వారీగా ప్రత్యేక బస్సుల చార్జీల వివరాలు ఇలా..

రూట్	బస్సు సర్వీస్	పెద్దలకు (రూ.)	పిల్లలకు (రూ.)
హనుమకొండ - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	250	140
	ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్	260	150
	డీలక్స్	290	160
	ఎలక్ట్రిక్ డీలక్స్	310	180
	సూపర్ లగ్జరీ	330	190
	ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ	350	210
	రాజధాని	420	330
	గరుడ (+)	500	380
నర్సంపేట - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	330	180
మహబూబాబాద్ - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	400	220
తొర్రూరు - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	360	190
జనగామ - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	390	220
భూపాలపల్లి -కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	120	70
	సూపర్ లగ్జరీ	160	100
పరకాల - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	190	110
హైదరాబాద్ - కాళేశ్వరం	ఎక్స్‌ప్రెస్	570	320
	డీలక్స్	670	370
	సూపర్ లగ్జరీ	760	420
	రాజధాని	960	740
	గరుడ (+)	1130	870

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సరస్వతీనది పుష్కరాలకు వచ్చే భక్తులు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. భక్తులను చేరవేసేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. భద్రతతో కూడిన సౌకర్యవంత ప్రయాణం అందిస్తాం. అవసరమైతే బస్సుల సంఖ్య పెంచుతాం. అధికారుల నిరంతర పర్యవేక్షణలో సురక్షితంగా, క్షేమంగా భక్తులను చేరవేస్తాం.

డి.విజయభాను, రీజినల్ మేనేజర్, వరంగల్

పుష్కరాలకు పటిష్ట భద్రత

- ఎస్పీ కిరణ్ ఖరే



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26తేదీ వరకు జరుగనున్న సరస్వతీనది పుష్కరాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఈ మేరకు సోమవారం కాళేశ్వరంలోని పుష్కర ఘాట్‌లతోపాటు పోలీసు భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీనది పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానున్నట్లు పేర్కొన్నారు. సరిహద్దు రాష్ట్రాలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసులతో సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు.

మూడు షిఫ్టుల్లో 3,500 పోలీసుల విధులు..

పుష్కరాల సందర్భంగా మల్టీజోన్ -1 నుంచి సుమారు 3,500 మంది పోలీసు అధికారులు, సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారని ఎస్పీ తెలిపారు. 200 సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. 14 పార్కింగ్ స్థలాలు,7 హోల్డింగ్ పాయింట్స్ పార్కింగ్ స్థలాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పుష్కరాల్లో మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక మహిళా పోలీసు విభాగంతో పాటు, 'షీ' టీమ్స్ పనిచేస్తాయని తెలిపారు.

వాహనాల మళ్లింపు ఇలా..

పుష్కరాల వచ్చే భక్తుల వాహనాలను నిర్దేశించిన స్థలాల్లో పార్క్ చేసేలా పలు మళ్లింపులు చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్, వరంగల్ నుంచి వచ్చే వాహనాలు కాటారం నుంచి పలుగుల క్రాస్ మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు మంథని, గంగారం క్రాస్, పలుగుల క్రాస్ మీదుగా కాళేశ్వరం రావాలని, అలాగే, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల నుంచి వచ్చే వాహనాలు సిరొంచ అంతర్రాష్ట్ర వంతెన నుంచి కాళేశ్వరం చేరుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత షటిల్ బస్‌లు నడపనున్నారని తెలిపారు. ఘాట్ల వద్ద భక్తులకు ప్రమాదాలు జరగకుండా ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, రెస్క్యూ టీంలు, పోలీసులు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ బోనాల కిషన్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు రామ్మోహన్ రెడ్డి, సంపత్ రావు, నారాయణ నాయక్, మహదేవపూర్ సీఐలు రామచందర్ రావు, నాగార్జున రావు, నరేశ్, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం ముక్తీశ్వరుడు..

- పుష్కరాల్లో ప్రధాన ఆకర్షణగా కాళేశ్వరాలయం



కాళేశ్వరం: రాష్ట్రంలోని మహాప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒక్కటైన మహాక్షేత్రం కాళేశ్వరం. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం కాళేశ్వర-ముక్తీశ్వరులు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల భక్తులతో నిత్యం పూజలందుకుంటూ విరాజిల్లుతోంది. ఈ క్రమంలో ఈనెల 15నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కర శోభను సంతరించుకోనుంది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒకే పానవట్టం పై రెండు శివలింగాలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఈలింగాలలో ఒకటి కాలుడు (యముడు), ముక్తీశ్వరుడు (శివుడు)గా వెలిసినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ముక్తీశ్వర లింగానికి రెండు నాశికారంధ్రాలు ఉంటాయి. అందులో ఎన్ని బిందెల నీళ్లు పోసినా బయటకు కనిపించవు. ఆ నీరు సొరంగ మార్గంగుండా గోదావరిలో కలుస్తుందని పూర్వీకులు తెలుపుతున్నారు. గర్భగుడికి నాలుగు దిక్కులా నాలుగు ద్వారాలు, నాలుగు నంది విగ్రహాలు, నాలుగు ధ్వజ స్తంభాలు, నాలుగు గోపురాలు ఉండడం కాళేశ్వర క్షేత్రం విశేషం. కాళేశ్వరం క్షేత్రం గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో మహారాష్ట్ర నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత, ఆదిలాబాద్ నుంచి గోదావరి, అంతర్వాహిణి సరస్వతీ నదులు కలిసిన క్షేత్రం కాళేశ్వరమని ప్రాచుర్యంలో ఉంది.

కాళేశ్వరం క్షేత్ర నిర్మాణం..

పూర్వం యమ ధర్మరాజు ఓ కార్యం నిమిత్తం స్వర్గలోకంలో ఇంద్రుడి వద్దకు వెళ్లాడు. ఇంద్రలోకంలోని వైభవాలు చూశాడు. ప్రజలు ఇక్కడ సుఖసంతోషంగా ఉంటూ యమలోకానికి రావడానికి ఇష్టపడడం లేదు. వీరంతా ఆ మహాశివుడిని పూజిస్తున్నట్లు తెలుసుకున్నాడు. మహాశివుడిని పూజిస్తే కోరికలు తీరుతాయని గ్రహించి ముక్తీశ్వర ఆలయం ఎదుట 12 సంవత్సరాల పాటు ఘోర తపస్సు చేశాడు. ముక్తీశ్వరుడు ప్రత్యక్షమై యమధర్మరాజును తపస్సు ఎందుకు చేస్తున్నావు..నీ కోరిక ఏంటని ప్రశ్నించాడు.అందుకు యమధర్మరాజు నీవు భక్తులకు సర్వపాపాలు తొలగించి సుఖసంతోషాలను ప్రసాదిస్తూ కైలాసానికి పంపుతున్నావు. యమలోకంలో నాకు పని లేకుండా పోయిందని పేర్కొన్నాడు. అందుకోసం ముక్తీశ్వరాలయంలో నీ లింగం పక్కనే నాకు చోటు కల్పించి భక్తులు నీకంటే ముందు నన్నే పూజించాలని ముక్తీశ్వరుడితో వేడుకున్నాడు. అందుకు ముక్తీశ్వరుడు తన పక్కన ఆలయంలో చోటు కల్పించాడు. అందుకే కాలుడు, ముక్తీశ్వరుడు ఇద్దరు వెలిసిన నేపథ్యంలో 'కాళేశ్వరం' అనే పేరు వచ్చినట్లు పురాణాలు వివరిస్తున్నాయి. అదేవిధంగా కాళేశ్వరమనే పట్టణం నిర్మితమైంది. ఈ ఆలయంలో ఒకే పానవట్టం పై ఓవైపు యముడు, మరోవైపు శివుడు కొలువయ్యారు. ముందు యముడి(కాలుడు)ని కొలిచిన తర్వాతే శివు(ఈశ్వరుడు)డిని భక్తులు ఆరాధిస్తారు. అప్పటి నుంచి ఈ క్షేత్రం భక్తజనులతో ప్రాచుర్యంలోకి వచ్చిందని పురాణాలు తెలుపుతున్నాయి. ప్రధానాలయంతో పాటు మహాసరస్వతి, శ్రీశుభానందాదేవి అమ్మవారి ఆలయాల్లో భక్తులు పూజలు చేస్తారు.

శ్రాద్ధ త్రికోటి సరస్వతీనది పుష్కరాలు



శ్రాద్ధ త్రికోటి సరస్వతీనది పుష్కరాలు ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్నాయి. నదిలో స్నానమాచరిస్తే పుణ్యఫలం లభిస్తుంది. ముఖ్యంగా పితృదేవతలకు తీర్థశ్రాద్ధాలు, పిండప్రదానాలు ముఖ్యం. సంకల్ప స్నానాలు చేయాలి. నదీపూజ తప్పని సరి చేయాలి.

పనకంటి ఫణీంద్రశర్మ, ఉపప్రధాన అర్చకుడు, కాళేశ్వరం దేవస్థానం

ప్రయాగ కన్నా త్రివేణి స్నానం గొప్ప



నదిలో 12 రోజుల పాటు స్నానాలు ఆచరిస్తే పుణ్యఫలం లభిస్తుంది. 33 కోట్ల దేవతామూర్తులు నది జలాల్లో సంచరిస్తారు. పుష్కరిణిలో స్నానాలు చేస్తే పాపాలు తొలగి పుణ్యం ప్రాప్తిస్తుంది. త్రివేణి సంగమం కలిసే చోట అంతర్వాహిణి సరస్వతీనదిలో పుష్కర స్నానం చేస్తే ప్రయాగ నది కన్నా కోటిరెట్ల పుణ్యమని పురాణాల్లో ఉంది. పుష్కర స్నానంతో సర్వపాపాలు తొలగి ముక్తి లభిస్తుంది.

త్రిపురారి కృష్ణమూర్తిశర్మ, రిటైర్డ్ ఉపప్రధాన అర్చకుడు, కాళేశ్వరం దేవస్థానం

సరస్వతీనది పుష్కరాలకు రండి..

- భక్తులకు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, సురేఖ పిలుపు

కాళేశ్వరం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతొలిసారి వస్తున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు భారీగా తరలిరావాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ వేర్వేరుగా సోషల్‌మీడియా వేదికగా పిలుపునిస్తున్నారు. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతీనది పుష్కరాలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.35కోట్లు మంజూరు చేసి భక్తులకు సకల సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొంటున్నారు. 15న సీఎం సరస్వతీఘాట్ వద్ద సరస్వతీమాత విగ్రహం, రాష్ట్రంలో మొదటిసారి కాశీ పండితులతో నవహారతులు, టెంట్‌సిటీ వంటి సౌకర్యాలను ప్రారంభిస్తారని తెలుపుతున్నారు.

పీఠాధిపతులకు ప్రత్యేక విడిది..



సాలహారంగా మార్చిన త్రివేణి గెస్ట్‌హౌస్

కాళేశ్వరం : సరస్వతీనది పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే పీఠాధిపతుల కోసం దేవాదాయశాఖ ప్రత్యేకంగా విడిది ఏర్పాట్లు చేసింది. కాళేశ్వరంలోని త్రివేణి గెస్ట్‌హౌస్‌ను కాకినాడకు చెందిన శిల్పులు సాలహారం సిమెంట్‌తో అందంగా ముస్తాబు చేశారు. 15 నుంచి 26 వరకు పదుల సంఖ్యలో రోజుకు ఒకరు తరలొచ్చి స్నానం ఆచరించనున్నారు.

ప్రమాద హెచ్చరిక జెండాలు ఏర్పాటు



త్రివేణి సంగమంలో ఎరుపు జెండాలు, బెలూన్లు

కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో లక్షలాదిగా పుణ్యస్నానాలు ఆచరించడానికి తరలొచ్చే భక్తులు ప్రమాదాలకు గురికాకుండా ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో కొంత లోతు వరకు ఎరుపు జెండాలు, బెలూన్స్ ఏర్పాటు చేశారు. మోకాలు లోతు నీటిలో స్నానాలు ఆచరించనున్నారు.

'బాహుబలి' సెట్టింగ్స్!



సరస్వతీమాత విగ్రహంపై ఏర్పాటు చేసిన సింహం బొమ్మలు

కాళేశ్వరం: పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు పులకించేలా బాహుబలి మాదిరి సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. నాలుగు స్తంభాలకు నమస్కరిస్తున్న సింహాల బొమ్మలు ఏర్పాటు చేశారు. ఘాట్‌లో తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం



దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేస్తున్న కూలీలు

కాళేశ్వరం: పుణ్యస్నానాలు చేసిన అనంతరం మహిళలు దుస్తులు మార్చుకోవడానికి సరస్వతీఘాట్ వద్ద గదులు నిర్మిస్తున్నారు. 24 వరకు గదులు నిర్మించారు. మెయిన్‌ఘాట్‌లో 12 గదులు నిర్మించారు.

కాశీపండితులతో నవహారతులకు సిద్ధం

కాళేశ్వరం: కాళేశ్వరంలో మే15 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతీనది పుష్కరాల్లో తొలిసారి కాశీపండితులతో నవహారతులు ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏడు గద్దెలు సరస్వతీమాత విగ్రహం ఎదుట నిర్మాణం చేశారు. ఏడుగురు పండితులు తొమ్మిది హారతులు 12 రోజుల పాటు ఇవ్వనున్నారు. కాశీ నుంచి పండితులు అశుతోశ్ పాండే, అభిషేక్ పాండే, నితీశ్‌కుమార్ పాండే, సమంత్ తివారీ, కౌశల్ తివారీ, దీపక్‌పాండే, అంకిత్‌పాండే, శివమ్ మిశ్రా ప్రత్యేక విమానంలో రానున్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ..

- హ్యాండ్ బ్యాగు నుంచి పదమూడున్నర తులాలు మాయం
- లబోదిబోమంటున్న బాధితురాలు
- పోలీసులకు ఫిర్యాదు



బాధితురాలు మమత

రఘునాథపల్లి: ఆర్టీసీ బస్సులో ఓ మహిళా ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగు నుంచి పదమూడున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిత్తలూరి మమత ప్రస్తుతం మెదక్ జిల్లా తూప్రాన్‌లో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తోంది. హనుమకొండలో సోదరుడి వద్ద ఉన్న కుమారుడు, కూతురును తీసుకొచ్చేందుకు తూప్రాన్ నుంచి బస్సులో గజ్వేల్‌కు.. అక్కడి నుంచి భువనగిరి చేరుకుని, మరో బస్సులో జనగామకు చేరుకుంది. మధ్యాహ్నం 12.20 గంటలకు హనుమకొండ వెళ్లేందుకు జనగామ బస్టాండ్‌లో హనుమకొండ డిపోనకు చెందిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఎక్కింది. రఘునాథపల్లి వచ్చాక హ్యాండ్ బ్యాగు జిప్ తెరిచి ఉండడంతో లోపల చూసింది. ఇందులో ఉన్న పదమూడున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీ అయినట్లు గుర్తించింది. ఈ విషయం కండక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డ్రైవర్ రాము దృష్టికి తీసుకెళ్లడంతో వారు నేరుగా బస్సును రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బస్సులోని ప్రయాణికులను తనిఖీ చేయగా ఆభరణాలు లభించలేదు. జనగామ బస్టాండ్‌లో, ఆయా గ్రామాల్లోని సీసీ పుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశాలు

హన్మకొండ : ఒడిశా రాష్ట్రంలోని బర్గర్‌లో గల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఎం.విజయలక్ష్మి తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన విద్యార్థులకు 9 సీట్లు కేటాయించారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై, 2025, జూలై 16 వరకు బీసీ, జనరల్ కేటగిరీ విద్యార్థులు 15నుంచి 23 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న వారు, ఎస్సీ, ఎస్టీలైతే 25 సంవత్సరాల వయస్సు వరకు అర్హులని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఐహెచ్‌టీబీఎఆర్‌జీఎఆర్‌హెచ్.ఓఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొందాలన్నారు. జూన్ 10వ తేదీలోపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా వెంకటగిరిలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

యథావిధిగా డిగ్రీ పరీక్షలు

నేడు హాల్ టికెట్ల జారీ

- ఫీజులు చెల్లించని మరికొన్ని కాలేజీలు
- ఫీజు చెల్లించిన కాలేజీల విద్యార్థులకే ఎగ్జామ్స్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ తదితర కోర్సులు 2, 4, 6 సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 14నుంచి(బుధవారం) నిర్వహించనున్నారు. అలాగే, బ్యాక్‌లాగ్ డిగ్రీ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ల పరీక్షలు కూడా నిర్వహించబోతున్నారు. ఇప్పటికే వెల్లడించిన టైం టేబుల్ ప్రకారం పరీక్షలు ఉంటాయని పరీక్షల విభాగం అధికారులు స్పష్టం చేశారు అయితే సోమవారం రాత్రి వరకు విద్యార్థులకు సంబంధించిన హాల్‌టికెట్లు జారీ చేయలేదు. నేడు (మంగళవారం) హాల్‌టికెట్లు జారీ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

పరీక్షల నిర్వహణకు యాజమాన్యాలు ఓకే..

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని తాము ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటూ పరీక్షలకు సహకరించబోమని ఎక్కువ శాతం ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫీజులు చెల్లించకుండా మొండికేశాయి. దీంతో రెండుసార్లు డిగ్రీ పరీక్షలు వాయిదా వేశారు. ఫీజులు చెల్లించేందుకు 138 ప్రైవేట్ కాలేజీలు ముందుకు రాకపోవడంతో వాటి పేర్లను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) వెబ్‌సైట్ నుంచి అధికారులు తొలగించారు. అయితే కొన్ని కాలేజీలు పరీక్షల ఫీజులు చెల్లించాయి. సోమవారం ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయించాలని కోరారని సమాచారం. అయితే తప్పనిసరిగా ఈనెల 14నుంచి డిగ్రీ పరీక్షలు జరుగుతాయని ఫీజులు చెల్లించి పరీక్షలు నిర్వహణకు సహకరించాలని కూడా ఆదేశించారని సమాచారం. దీంతో ఆయా యాజమాన్యాలు ఇక పరీక్షల నిర్వహణకు ఓకే చెప్పాయి.

ఒక్కరోజులో ఫీజుల చెల్లింపు

దోస్త్ నుంచి పేర్లు తొలగించిన డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు కొందరు ఇటీవల పరీక్షల ఫీజులు చెల్లించగా ఎక్కువ సంఖ్యలో కాలేజీలు సోమవారం ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి పరీక్షల విభాగానికి వాట్సాప్‌లో వివరాలు పంపారు. మరిన్ని కాలేజీలు ఇంకా పరీక్షల ఫీజులు చెల్లించలేదు. మంగళవారం వారు కూడా ఫీజులు చెల్లిస్తారని భావిస్తున్నారు. చెల్లించకపోతే ఆయా కాలేజీల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించబోమని పరీక్షల విభాగం అధికారులు స్పష్టం చేస్తున్నారు.

మొదటి రెండు పరీక్షలు చివరికి నిర్వహించండి!

పరీక్షల నిర్వహణకు ఒక్కరోజే మిగిలి ఉండడంతో హాల్‌టికెట్ల జారీ, సిట్టింగ్ అరెంజ్‌మెంట్ ఇబ్బందిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ముందు జరిగే రెండు పరీక్షలు చివరికి నిర్వహించాలని మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారం నిర్వహించాలని ప్రైవేట్ యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు

పరీక్షల విభాగం అధికారులు మాత్రం ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, నేడు హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈనెల 14నుంచే టైంటేబుల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ స్పష్టం చేశారు. మొదటి రెండు పరీక్షలు కూడా చివరికి నిర్వహించే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే జాప్యం జరిగిందని, ఇంకా ఆలస్యమైతే వాల్యుయేషన్ ప్రక్రియ జాప్యమయ్యే అవకాశాలుంటాయని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో రోగి మృతి..?

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన
- విచారణ చేపట్టిన డీఎంహెచ్‌ఓ



బంధన్ ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

హన్మకొండ చౌరస్తా : వైద్యుల నిర్లక్ష్యంతోనే రోగి మృతి చెందాడంటూ ఆస్పత్రి ఎదుట రోగి బంధువులు సోమవారం ఆందోళన చేపట్టారు. మృతుడి బంధువులు తెలిపిన కథనం ప్రకారం .. వరంగల్ రంగశాయిపేటకు చెందిన మహేందర్‌రావు కడుపునొప్పితో బాధపడుతూ ఆదివారం హనుమకొండలోని బంధన్ ఆస్పత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు అడ్మిట్ చేసుకుని చికిత్స ప్రారంభించారు. రాత్రి వరకు బాగానే ఉన్నాడని చెప్పిన వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యం, సోమవారం ఉదయం మహేందర్ రావు చనిపోయినట్లు వెల్లడించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణులైన వైద్యులు చికిత్స చేయకుండా ఫార్మాడీ, బీఎంఎస్ వైద్యులు చికిత్స చేయడంతోనే మృతి చెందాడని బంధువులు చెబుతున్నారు. ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. కొందరి మధ్యవర్తిత్వంతో మృతుడు కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం చెల్లిస్తామన్న హామీతో గొడవ సద్దుమణిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో బంధన్ ఆస్పత్రి వద్ద జరుగుతున్న ఆందోళనను గుర్తించిన డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఆస్పత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేస్‌షీట్స్‌ను హనుమకొండ పోలీసులు తీసుకెళ్లడంతో పూర్తి చికిత్స వివరాలు తెలియాల్సి ఉందన్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటన జరిగిందని, వైద్య సేవల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని ఆస్పత్రి యాజమాన్యాన్ని హెచ్చరించారు.